రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

విధుల్లో భాగంగా ద్విచక్ర వాహనంపై విశాఖపట్నం వెళ్తూ మార్గమధ్యలో రోడ్డు ప్రమాదానికి గురై గిరిజన ఉపాధ్యాయుడు మృతి చెందాడు. మారేడుమిల్లి మండలం జిఎం.వలస జిపిఎస్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న బోడిక శ్రీనివాస్ రెడ్డి(28) గురువారం ఉదయం తన స్వగ్రామం చెరువుపాలెం నుండి డిపార్టుమెంటల్ ఎగ్జామ్ నిమిత్తం బైక్‌పై విశాఖపట్నం వెళుతున్న సమయంలో మార్గం మధ్యన బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎగిరిపడి అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో రంపచోడవరం మండలం పెదగెద్దాడ పంచాయతీ చెరువుపాలెం గ్రామంలో విషాదం నెలకొంది. ఆయన మృతి వార్త వినగానే కుటుంబ సభ్యులు, పాఠశాల సిబ్బంది, స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ప్రతి ఒక్కరితో ప్రేమగా మాట్లాడుతూ ఉండే స్నేహ స్వభావి, యుక్త వయసులోనే మృతి చెందడం కుటుంబ సభ్యులకు తీరని లోటని సంబంధిత శాఖ నుండి విచారం వ్యక్తం చేశారు.

మణిపూర్‌లో హింసాకాండ పై

మన్యం బంద్ విజయవంతం

- నిలిచిన ఆర్‌టిసి బస్సులు,
-తెరచుకోని బ్యాంకులు, దుకాణాలు
-మూతపడిన పర్యాటక కేంద్రాలు
-పెద్దఎత్తున గిరిజనుల నిరసన

పాడేరు కాంప్లెక్స్‌లో నిలిచిన బస్సులు

ప్రజాశక్తి -యంత్రాంగం

మణిపూర్‌లో ఆదివాసీలపై మతోన్మాద శక్తుల మారణ హోమాన్ని నిరసిస్తూ ఆదివాసీ, గిరిజన, ప్రజా సంఘాలు, పలు పార్టీలు గురువారం నిర్వహించిన మన్యం బంద్ అల్లూరి జిల్లాలో విజయవంతమయ్యింది. జిల్లాలో అన్ని వర్గాల ప్రజలు, గిరిజనులు బంద్‌కు స్వచ్ఛందంగా సంపూర్ణ మద్దతును తెలిపారు. జిల్లాలో ఆర్‌టిసి బస్సులు ఎక్కడికక్కడే నిలిచి పోయాయి. బ్యాంకులు, వర్తక వాణిజ్య సంస్థలు తెరచుకోలేదు. పర్యాటక కేంద్రాలు మూతపడ్డాయి.

అరకులోయ రూరల్:పర్యాటక కేంద్రమైన గిరిజన మ్యూజియం, పద్మావతి గార్డెన్, కాఫీ మ్యూజియం, వ్యాపార వాణిజ్య సముదాయాలు పూర్తిగా మూతపడ్డాయి. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, మణిపూర్‌లో అత్యాచారాలు, దాడులు జరుగుతుంటే నరేంద్ర మోడీ, రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదప లేదని విమర్శించారు. అక్కడి సహజ వనరులను బడా పెట్టుబడిదారులకు అప్పజెప్పడానికి మతాల మధ్య చిచ్చుపెట్టి హింసకాండని సృష్టిస్తున్నారన్నారు. చర్చిలు, మసీదులపై దాడి చేసే హక్కు బీజేపి, ఆర్‌ఎస్ఎస్ శక్తులకు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. మూడు నెలలుగా హింసాకాండ జరుగుతుంటే పోలీసులు దగ్గరుండి సహరించారని, దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. చర్చిలు, ఇళ్లను తగలబెట్టి వందల కోట్ల ఆస్తులకు నష్టం జరుగుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ప్రధాన పొద్దు బాలదేవ్, సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పాచిపెంట శాంత కుమారి, జెడ్పీటీసీ శెట్టి రోషిని, దండకారణ్య యోచన రాష్ట్ర నాయకులు కొర్ర ప్రసన్న కుమార్, జాన్ బాబు, రమేష్, ఆదివాసి గిరిజన మండల అధ్యక్ష కార్యదర్శి పి.రామన్న, బుజ్జిబాబు, హుకుంపేట జెడ్పీటీసీ రేగం మత్యలింగం, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వి.మహేష్, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ దనలక్ష్మి మోహన్, కాఫీ రైతుల జిల్లా ప్రధాన కార్యదర్శి జి.చినబాబు, మగ్గన హరి, కోగేష్ పాల్గొన్నారు.

పాడేరు:పాడేరులో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు అనంతరం జరిగిన సభలో ఆదివాసి గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పీ.అప్పలనరస మాట్లాడుతూ, మణిపూర్‌లో ఆదివాసీలను చంపుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొద్దు నిద్రలో ఉన్నాయని దుయ్యబట్టారు.దేశవ్యాప్తంగా అటవీ సంపదను ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి అటవీ చట్టాన్ని సవరణ చేశారని విమర్శించారు. ఆదివాసి ప్రాంతాల్లో గిరిజన చట్టాలను చిత్తశుద్ధితో అమలు చేయకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మన్న పడాల్, ఉపాధ్యక్షుడు సుందర్ రావు, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కె రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాడేరులో ర్యాలీ చేస్తున్న అప్పలనర్స, నాయకులు

అనంతగిరి:అనంతగిరి, చిలకలగెడ్డ పంచాయతీ వెంకయ్యపాలెం, అరకు ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు మూతపడింది. కటికి, తాడిగుడ, జలపాతాలు, కాఫీ ప్లాంటేషన్, డమ్ముకు సుంకరమెట్ట యు పాయింట్లు మూతపడ్డాయి. ఈ సందర్భంగా జెడ్పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, మణిపూర్‌లో శాంతి భద్రతలు నెల కొల్పే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు ఎస్.నాగులు, జె.సుబ్బారావు, క్రిష్ణ, పుడిగి. దేముడు, రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు

అనంతగిరిలో నిరసన తెలుపుతున్న గంగరాజు, నాయకులు

పెదబయలు :మండల కేంద్రంలో జోరు వర్షంలోనూ బంద్ విజయవంతం అయ్యింది. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం పూర్వ అధ్యక్షులు బోండా సన్నిబాబు, ప్రధాన కార్యదర్శి కొమ్మ పృధ్విరాజ్, నాయకులు కె.శరబన్న, సీతగుంట వైస్ సర్పంచ్ గంగాధరం, పర్రెడ సర్పంచ్ చెండా రవిశంకర్ పాల్గొన్నారు.

మారేడిమిల్లిలో మానవహారం

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆదివాసీ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ, ఆదివాసీ మహిళా సంఘం ఐద్వా వివిధ సంఘాలు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎంఎం శ్రీను, మండల కార్యదర్శి కే నరసయ్య, లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్, మండల వైస్ ఎంపిపి 1 సత్యనారాయణ, సిపిఎం నాయకుడు గాసిరం దొర, వైసీపీ మండల అధ్యక్షుడు మలికర్జున్, కన్వీనర్ కొండలరావు, జగబంద్, టీడీపీ నాయకులు శాస్త్రీబాబు, పాస్టర్ల సంఘం అధ్యక్షుడు మోహన్, పాస్టర్ కనక రత్నం, సిపిఎం నేత భీమరాజు, మహిళ సంఘం మండల అధ్యక్షులు కార్యదర్శి ఈశ్వరి, విజయ, గిరిజన సంఘం నాయకులు శ్రీను, సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకర్ పాల్గొన్నారు.

హుకుంపేట:మండలం కేంద్రంలో దుకాణాలు, బ్యాంక్‌లు, విద్యాలయాలు మూతపడ్డాయి. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాపుల కృష్ణారావు, డీఎల్‌ఓ వ్యవస్థాపక అధ్యక్షులు చెండా ఏలీయా, సీపీఎం నాయకులు సూడిపల్లి కొండలరావు, ఐద్వా జిలా కార్యదర్శి హైమావతి, పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యక్షుడు కంబిడి జేమ్స్, తడిగిరి సర్పంచ్, డీ ఎల్ ఓ రాష్ట్ర అధ్యక్షుడు పెనుమాల రంజిత్ కుమార్, కొంతిలి సర్పంచ్ రేగం రమేష్, వైస్ సర్పంచ్ కిల్లో రామారావు, సీపీఎం మండల కార్యదర్శి వలసనైని లక్ష్మణ్‌రావు, సీఐటీయూ మండల కార్యదర్శి తమార్బ అప్పల కొండ పడాల్, పైనంపాడు వైస్ చర్పంచ్ కొర్రా తమన్నా, పార్వతీ, కార్పెంటర్స్ యూనియన్ నాయకులు శ్రీను, శివ పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: మండల కేంద్రంలో గిరిజన సంఘం నాయకులు ఆధ్వర్యంలో ఉదయం నుంచి బంధ్ జరిగింది. చాపరాయి జలపాతం పూర్తిగా మూతబడింది. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు, పి కుమారి, మండల నాయకులు పి.సురేష్ కుమార్, పి.సత్యనారాయణ, వర్తక సంఘం అధ్యక్షుడు ఎస్ గోపాల్, సిఐటియు మండల కార్యదర్శి ఎస్ గుర్మి సింగ్, యానిమెట్ల సంఘం మండల అధ్యక్షుడు పి భాస్కర్, రాము ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

అరకులోయలో మూతపడ్డ ట్రైబల్ మ్యూజియం

పాడేరు: చింతపల్లి మండల కేంద్రంలో హనుమాన్ జంక్షన్ నుంచి సంతపాకల వరకు ర్యాలీ నిర్వహించారు . అనంతరం హనుమాన్ జంక్షన్ లో నిరసనను తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో భాషా వాలంటీర్ల సంఘం నాయకులు సర్బు నాయుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వంతల సుబ్బారావు, సిపిఎం అల్లూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు . బోనంగి చిన్నయ్య పడాల్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సగ్గే కొండలరావు, మహిళా సంఘం నేత వెంకయ్యమ్మ, టిడిపి అరకు పార్లమెంట్ ఇన్చార్జి చల్లంగి జ్ఞానేశ్వరి, ఎస్ఎఫ్ఐ జిల్లా నేత కార్తీక్, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్ పాల్గొన్నారు.

జి.మాడుగుల:బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు రాంబాబు, సన్యాసి దొర, టిడిపి నేతలు భీంబాబు, గణపతి, హిమాలయ, సిపిఎం నేతలు ధర్మారావు, రామన్న, జనసేన నేతలు భానుప్రసాద్, రమేష్, ఆదివాసి గిరిజన మహిళ సంఘం మండల అధ్యక్షులు ఎ. శ్రీలత ఈశ్వరమ్మ, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, సీఐటీయూ మండల కార్యదర్శి దీనబంధు, మహేష్, ఆదివాసి మతృభాష సంఘం నాయకులు చిన్నారావు, సుబ్బారావు. రైతునేస్తం ఫౌండేషన్ లక్ష్మణ్ వెంకట్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి:మణిపూర్‌లో మారణ హోమం వెంటనే ఆపాలని, జీవో నెంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలని, బోయవాల్మీకిలను ఎస్టీ జాబితాలోకి చేర్చరాదని, అటవీ సంరక్షణ చట్ట సవరణను విరమించుకోవాలని, పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘాలు సంయుక్త పిలుపు మేరకు మన్యం బంద్ రంపచోడవరం ఏజెన్సీలో విజయవంతమైంది. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ సెంటర్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని మానవహారం నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా బందుకు ప్రభుత్వ అధికారులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్రాన్ని మరో మాణిపూర్ చేయొద్దని, విలువైన అటవీ సంపద మైనింగ్ కార్పొరేట్లకు అప్పజెప్పొద్దని హితవుపలికారు. గిరిజనులంతా ఐక్యంగా పోరాడి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, న్యాయవాది చుక్క సంతోష్, పాస్టర్ల పెలోషిప్ జిల్లా సెక్రటరీ చంద్రపాల్, సీఐటీయూ నాయకులు కె.శాంతిరాజు, కొమరం, చెల్లాయమ్మ పాల్గొన్నారు.

సీలేరులో...

మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలంలో బంద్ సందర్భంగా కిరాణ కొట్లు, హోటళ్లు, వివిధ వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. పలువురు బంద్‌కు మద్దతుగా తమ వాహనాలను నిలిపి వేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, కాలేజీలు, పాఠశాలలు మూతపడ్డాయి. మండల కేంద్రంలో 400 మంది విద్యార్థులు, యువకులు, ఉపాధ్యాయులు భారీ శాంతి ర్యాలీ నిర్వహించి, మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో వేటుకూరు సర్పంచ్ ఈతపల్లి మల్లేశ్వరి, పలు సంఘాల నాయకులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, ఆవుల ధర్మారెడ్డి, గొర్లె అనిల్ ప్రసాద్ (బాబి), గొర్లె అనుదీప్ కుమార్, వీకా రాజన్న దొర, దూడ ప్రణీత్, కత్తుల గంగిరెడ్డి, బచేలా చిన్నా రెడ్డి, బి.దాసు, జి.కిషోర్, జి.బాబురావు, ఇ.కుమారి, బి.శివ ప్రసాద్ రెడ్డి, ఇ.సత్యవతి, బి.ముత్యాల రెడ్డి, వీకా రాజన్న దొర, బట్ట మలిరెడ్డి పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : బందు నేపథ్యంలో రాజవొమ్మంగిలో వర్తక వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారిపై రాస్తారోకో, బైఠాయింపు కార్యక్రమాలు చేపట్టారు. వాహనాలు తిరగకుండా అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఒడుగుల జ్యోతి, సర్పంచ్‌లు ఆగూరు సుబ్బలక్ష్మి, మిర్యాల గనలక్ష్మి, సత్యవతి, చంద్రుడు ఎంపీటీసీ జి పెద్దిరాజు, గిరిజన సంఘాల నాయకులు కొండ్ల సూరిబాబు, వంతు బాలకృష్ణ, ఈకా శ్రీను, వజ్రపు అప్పారావు, తెడ్ల అబ్బాయి, కుంజం జగన్నాధం, గంపా నాగరాజు రాజు, అప్పారావు, రామరాజు, టి శ్రీను, రామకృష్ణ, ఎస్ వీరబాబు, కె రాంబాబు, జిలానీ పాల్గొన్నారు.

అడ్డతీగల : మన్యం బంద్ అడ్డతీగలలో విజయవంతమైంది. వర్తక వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. ఏలేశ్వరం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులు స్వచ్ఛందంగానే నిలుపుదల చేశారు. గోకవరం డిపోకు చెందిన బస్సులను ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు నిలుపుదల చేశారు. ప్రధాన రహదారిపై బైఠాయింపు చేపట్టారు. ఆదివాసీ గిరజన సంఘాల నాయకులు ఎస్ కృష్ణ, ఐ.రమణ పాల్గొన్నారు.

సీలేరు : మన్యం బందులో భాగంగా జీకే వీధి మండల కేంద్రం మెయిన్ రోడ్‌లో గిరిజనులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి బంద్‌కు మద్దతు తెలిపారు. దారకొండ ప్రధాన రహదారిపై ఆందోళన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాల్లో గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు, సిపిఎం నాయకులు బాకూరి కోటేశ్వరరావు, సిపిఐ నాయకులు సుంకర విష్ణుమూర్తి, మార్క్ రాజు, టిడిపి, కాంగ్రెస్, సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కొయ్యూరు : కొయ్యూరులో జరిగిన బంద్‌కు సిపిఎం, సిపిఐ, టిడిపి, జనసేన పార్టీలు మంద్‌కు సంపూర్ణ మద్దతు పలికాయి. మణిపూర్‌లో ఆదివాసీల మీద జరుగుతున్న హింసాకాండను ఆపకపోతే దేశంలోని అన్ని రాష్ట్రాల ఆదివాసీలు ఐక్యతగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు ఎస్.సూరిబాబు, సాగిన బుజ్జిబాబు, గుడి లక్ష్మణ్, ఇరువాడ దేవుడు, కనకరాజు, మాకాడ బాలరాజు, చిట్టిబాబు, మేడిపోయిన చిన్న, గంగరాజు పాల్గొన్నారు.

చింతూరు : మణిపూర్ సంఘటనకు వ్యతిరేకంగా గురువారం గిరిజన సంఘం, ఐద్వా ఆధ్వర్యాన మండల కేంద్రంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాస్, పండ కృష్ణయ్య, ముర్రం రంగమ్మ, మాల్లం సుబ్బమ్మ, పల్లపు వెంకట్, రాజయ్య, చిన్నయ్య, లక్ష్మణ్ సుబ్బారావు పాల్గొన్నారు.

దుంబ్రిగుడలో..

వరద బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి, సర్పంచ్

వరద బాధితులకు ఆర్థిక సాయం పంపిణీ

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని రేఖపల్లి సచివాలయంలో వరద బాధితులకు ఎంపిపి కారం లక్ష్మి, జెడ్పీటిసి వాళ్ళ రంగారెడ్డి, ఎంపిడిఓ, స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని చేతుల మీదుగా ప్రభుత్వం అందజేసిన రూ.2వేలు ఆర్థిక సాయాన్ని గురువారం పంపిణీ చేశారు. అలాగే మండలంలోని రామవరం సర్పంచ్ కారం బుచ్చమ్మ, శ్రీరామగిరి సర్పంచ్ సంతోష్ కుమార్, విఆర్.పురం సోడి నరసమ్మ, పెద్ద మట్టపల్లి సర్పంచ్ లక్ష్మి, ములకనపల్లి సర్పంచ్ మారయ్య, చిన్నమటపల్లి, జీడిగుప్ప, పోచారం తదితర పంచాయతీ సర్పంచులు ఆయా గ్రామ సచివాలయాల వద్ద వరద బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రూ.2000 ఎటు సరిపోవని, రవానా ఛార్జీలే రూ.5000, ఇళ్ల శుభ్రం చేయడానికి రూ.20 వేల వరకు అయిందని తెలిపారు. గతేడాది రూ.10వేలు ఇస్తామని చెప్పిన మాట తప్పిన జగన్, ఈ ఏడాది కూడా రూ.2వేలు ఇచ్చి చేతులు దులుపుకుందామని చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే బాధితులకు రూ.10వేలు ఇవ్వాలని, పడిపోయిన ఇంటికి లక్ష రూపాయలు ఇచ్చి జగన్ మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, తెలుగుదేశం నాయకులు బురకా కన్నారావు, సచివాలయ ఇబ్బంది పాల్గొన్నారు.

కూనవరం : ఇటీవల వచ్చిన వరదలకు ప్రభుత్వం అందించిన సహాయం రూ.2000, కూరగాయలు, కందిపప్పు, పాల ప్యాకెట్లను మండలంలోని పెద్దార్కుర్ పంచాయతీలో బాధితులకు సర్పంచ్ నాగమణి, ఎంపీటీసీ అమ్మాజీ గురువారం పంపిణీ చేశారు. కూటూరు పంచాయతీలోని ముల్లూరు గ్రామంలో సర్పంచ్ బొగ్గ వెంకమ్మ ఆధ్వర్యంలో దోమల నివారణ చర్యగా ఫాగింగ్ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామ వాలంటీర్లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

సున్నం రాజయ్య ఆశయ బాటలో పయనిద్దాం

ఘనంగా మాజీ ఎమ్మెల్యే 3వ వర్ధంతి

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

భద్రాచలం సిపిఎం మాజీ ఎమ్మెల్యే, అమరజీవి కామ్రేడ్ సున్నం రాజయ్య 3వ వర్ధంతి కార్యక్రమాలు గురువారం పలు ప్రాంతాల్లో జరిగాయి. ఈ సందర్భంగా సిపిఎం, గిరిజన సంఘం నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజయ్య ఆశయ బాటలో పయనిద్దామని పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

ఎటపాక : అమరజీవి సున్నం రాజయ్య మూడవ వర్ధంతి సభ ఎటపాక మండలం వీరాయి గూడెంలో గురువారం జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని రాజయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో చట్టాలను కాపాడుతూ ప్రజలందరి కోసం నిరంతరం కష్టపడి పనిచేశారని కొనియాడారు. సిపిఎం ప్రజా ప్రతినిధి అంటే ఎలా ఉండాలో నిరూపించిన వ్యక్తి సున్నం రాజయ్య అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి ఐవి, ఐ.పద్మ, ఆకిశెట్టి రాము, ఇరపా అజయ్, పి.బాలకృష్ణ, ఇరపా సత్యం, తోట శ్రీను, సర్పంచ్ కొర్సా భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : సున్నం రాజయ్య వర్ధంతి సభ చింతూరు మండల కేంద్రంలోని ఆదివాసీ అమరవీరుల విగ్రహాల వద్ద ఘనంగా నిర్వహించారు. తొలుత రాజయ్య చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు పూలమాలను వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతా అభివృద్ధికి, గిరిజన సమస్యలపై రాజయ్య అలుపెరుగని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ముంపు మండలాల్లో వరదల సమయంలో ప్రతి పల్లెకు వెళ్లి నిర్వాసితులను పలకరించి వారి బాధలను ప్రభుత్వానికి, అధికారులకు తెలియజేసి వాటిని పరిష్కరించే వారని తెలిపారు. రాజయ్య ఆశయ బాటలో పయనిస్తామని కార్యకర్తలు, నాయకులు నినదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కుంజా సీతారామయ్య, మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు పల్లపు వెంకట్, రంగమ్మ, మల్లం సుబ్బమ్మ, ఎం రాజయ్య, పోడియం లక్ష్మణ్, సుబ్బారావు, మడకం చిన్నయ్య పాల్గొన్నారు.

రాజయ్య చిత్ర పటానికి పూలమాల వేస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

రాజవొమ్మంగి : మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య మూడవ వర్ధంతి సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు గురువారం ఘన నివాళులు అర్పించారు. ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన రాజయ్య చిత్ర పటాలతో ర్యాలీ నిర్వహించారు. సున్నం రాజయ్య అమర రహే అంటూ నినాదాలు చేశారు. అనంతరం స్థానిక ఆర్అండ్ బి అతిథి గృహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు కొండ్ల సూరిబాబు, వంతు బాలకృష్ణ, ఈకా శ్రీను, తెడ్ల అబ్బాయి, కుంజం జగన్నాధం, టి శ్రీను, ఎం రమేష్ మాట్లాడుతూ రాజయ్య 3 పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన నిరాడంబరుడుగా సేవలు అందించారని కొనియాడారు. రాజయ్య ఆశయ సాధనకై గిరిజనులు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు పి.సత్యనారాయణ, ఎం రాజు, గంపా నాగరాజు, రామరాజు, మల్లిఖార్జున, పి పాపారావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండంలోని సున్నంవారి గూడెంలో జరిగిన మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య 3వ వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు రాజయ్య స్థూపం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాజయ్య భార్య చుక్కమ్మ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, కూనవరం వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సిపిఎం సర్పంచ్‌లు పులి సంతోష్ కుమార్, పూనెం సరోజిని, కారం బుచ్చమ్మ, వెట్టి లక్ష్మి, చిన్నమట్టపల్లి ఎంపిటిసి పూనెం ప్రదీప్ కుమార్, సిపిఎం నాయకులు నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు, సోయం చిన్నబాబు, పూనెం సత్యనారాయణ, మేకల నాగేశ్వరరావు, పాయం సీతారామయ్య, పి.వెంకట్, సీసం సురేష్, కారం సుందరయ్య, వడ్లాది రమేష్, లక్ష్మణరావు, గూటాల శ్రీను, సత్యనారాయణ, పోడియం రాము, తాతబాబు పాల్గొన్నారు.

చింతూరులో నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజవొమ్మంగిలో రాజయ్య చిత్ర పటంతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సున్నంవారి గూడెంలో రాజయ్య స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కెజిహెచ్‌లో ఎక్స్‌రే ఫిల్మ్‌లు అందుబాటులో ఉంచాలి

- సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి-విశాఖపట్నం: కెజిహెచ్‌లో ఎక్స్‌రే ఫిల్మ్‌లను అందుబాటులో ఉంచాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్‌చేశారు. కెజిహెచ్‌లో రోగులకు ఎక్స్‌రేలు తీసిన తరువాత ఫిల్మ్ ఇవ్వడంలేదని, స్మార్ట్ ఫోన్‌లో ఫొటోలు తీసుకొని వైద్యులకు చూపించమంటున్నారని పేర్కొన్నారు. ఆసుపత్రికి వస్తున్న రోగుల్లో అత్యధికులు పేదలు, నిరక్షరాస్యులని, ఎంతమంది స్మార్ట్ ఫోన్ కొనగలరని ప్రశ్నించారు. స్మార్ట్ ఫోన్లు లేని రోగుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వెంటనే కెజిహెచ్‌లో ఎక్స్‌రే ఫిల్మ్‌లు అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, కెజిహెచ్ ఉన్నతాధికారులను డిమాండ్‌చేశారు. కెజిహెచ్‌లో మౌలి సదుపాయాలు పెంపుదలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని, అన్ని రకాల వ్యాధులకు పూర్తిగా మందులు అందించాలని, పేదలు బయట మందులు కొనుకొనే పరిస్థితిని నివారించాలని కోరారు. కెజిహెచ్‌లో వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీచేయాలని, పెరుగుతున్న రోగుల సంఖ్యకు తగ్గట్లు సిబ్బందిని పెంచాలని డిమాండ్‌చేశారు. కెజిహెచ్‌లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ, కాంట్రాక్టు సిబ్బందికి చట్టపరమైన వేతనాలు, సదుపాయాలు, సకాలంలో జీతాలు అందించే చర్యలు చేపట్టాలని కోరారు.

ముగిసిన ఎన్నికల కమిషన్ సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ -2024 కార్యక్రమంపై కేంద్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యాన జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన రెండు రోజుల సమీక్షా సమావేశం గురువారం ముగిసింది. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్‌మీనా అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు. సమగ్రమైన ఓటర్ల జాబితాను నిర్ధారించడానికి, పాత వారి వివరాలు, కొత్తగా నమోదుకు తీసుకోవల్సిన చర్యలపై కలెక్టర్లకు ముఖేష్‌కుమార్ మీనా దిశా నిర్దేశం చేశారు. ఇంటింటికి ధ్రువీకరణ, యువ ఓటర్ల గుర్తింపు, అట్టడుగు వర్గాలకు రిజిస్ట్రేషన్ డ్రైవ్ వేగవంతం చేయడానికి పలు సూచనలు చేశారు. అట్టడుగు సమాజం, నిరాశ్రయులు మొదలైన వారిలో అర్హులైన సభ్యులందరినీ 100 శాతం చేర్చాలని చెప్పారు. ఈ సమావేశంలో సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ ధర్మేంద్ర శర్మ, సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితీష్ కుమార్ వ్యాస్, డిప్యూటీ ఎన్నికల కమిషనర్ హిర్దేష్ కుమార్, సీనియర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్ఎన్ బుటోలియా, ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్ కుమార్, సంజయ్ కుమార్, డిఆర్ఓలు పాల్గొన్నారు.

ఎల్ఐసి సౌత్ సెంట్రల్ జోనల్ టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎల్ఐసి సౌత్ సెంట్రల్ జోనల్ టేబుల్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విశాఖలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో గురువారం ప్రారంభమయ్యాయి. జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాస్ పోటీలను ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుండి 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదా ప్రసాద్‌దాస్, మార్కెటింగ్ మేనేజర్ శ్రీనివాసచక్రవర్తి, మేనేజర్ పర్సనల్ భగవాన్ ప్రసాద్, స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు సభ్యులు జె.సురేష్, డివిఎస్‌వై.శర్మ, స్పోర్ట్స్ సెక్రటరీ బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

9న దీక్షలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : 'క్విట్ ఇండియా' స్ఫూర్తితో మోడీని గద్దె దింపి దేశాన్ని కాపాడుకోవటానికి కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు విశాఖ జిల్లా కేంద్రంలో ఈ నెల 9వ తేదీన చేపట్టే దీక్షను జయప్రదం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాలు కోరాయి. ఈ మేరకు గురువారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో సమావేశమయ్యాయి. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు పడాల రమణ మాట్లాడుతూ, ఈ దీక్షల జయప్రదం కోసం ఈ నెల 5, 6 తేదీల్లో పరిశ్రమల వద్ద గేటు మీటింగ్‌లు, జనరల్‌బాడీ సమావేశాలు, పాదయాత్రలు, 7న స్కూటర్ ర్యాలీ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాలలో కార్మికులు, ఉద్యోగులు ఐక్యంగా పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. మోడీ తొమ్మిదేళ్ల పాలనలో కార్మిక సమస్యలు ఏవీ పరిష్కారం కాలేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలన్న డిమాండ్‌ను పెడచెవిన పెట్టారని విమర్శించారు. స్కీమ్ వర్కర్లను పర్మినెంట్ చెయ్యాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర కీలక రంగాలతో సహా ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించే చర్యలు మోడీ ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. అసంఘటితరంగ కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్, ఆరోగ్య సౌకర్యాలతో కూడిన సామాజిక భద్రతా పథకాన్ని ప్రకటించాలని, కాంట్రాక్టు వర్కర్లకు సమానపనికి సమాన వేతనం చెల్లించాలని, కొత్త పెన్షన్ స్కీమ్‌ను రద్దుచేసి పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని, కనీస ఇపిఎస్ పెన్షన్‌ను రూ.9 వేలకు పెంచాలని డిమాండ్‌చేశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్గుణ

ప్రజాశక్తి - అరకులోయ : అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. జగనన్న సురక్ష పథకంపై గురువారం తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అర్హులైన అందరికీ భరోసా కల్పించడమే జగనన్న సంకల్పమని ఆయన అన్నారు. 115 సచివాలయంలో దరఖాస్తుదారులకి 11 రకాల సర్టిఫికెట్లు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ నెల రోజుల్లో 115 క్యాంపులు పెట్టి 86,499 హౌస్ హోల్డ్ సర్వే నిర్వహించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.జగనన్న సురక్షలో తన నియోజకవర్గంలో 64 608 సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు రాగా, 58,471 సర్టిఫికెట్లు లను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన అన్నారు. ఇందులో భాగంగానే రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆయన అన్నారు. ఇందులో అరకు నియోజకవర్గ పరిధిలో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ద్వారా 394 రోడ్లు నిర్మించగా, పీఆర్ నుంచి 761 రోడ్లు, పి ఎ యు పథకం కింద 105 రోడ్లు నిర్మించినట్లు ఆయన అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేజేఎం కింద 3752 కొళాయి కనెక్షన్లు ఇచ్చినట్లు ఆయన అన్నారు. అరకులోయ మండలం చొంపి రోడ్డు కూడా మంజూరు అయిందని, టెండర్లు పిలిచి నిర్మాణం చేపడతామని తెలిపారు.అరకు నియోజకవర్గంలో వైఎస్ఆర్ క్రాంతి పథకం లో 2200 గ్రూపులు ఉన్నాయని ఇందులో 23,533 మంది మహిళలు ఉన్నారని వీరికి 7 కోట్ల 48 లక్షల 68 వేల రూపాయల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసినట్లు ఆయన అన్నారు. వాలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేయడం పవన్ కళ్యాణ్ కు తగదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

సీ ప్లేన్... క్రూయిజ్ టర్మినల్‌కు...

సర్వేలతో కాలయాపన?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ పోర్టు నుంచి పర్యాటకుల కోసం వస్తాదని అంతా ఎదురుచూస్తోన్న సీ ప్లేన్, క్రూయిజ్ టర్మినల్ (పర్యాటక నౌక) విషయంలో కేంద్రం మీనమేషాలు లెక్కిస్తోంది. సర్వేల పేరుతో కాలయాపన చేసేదిశగా అడుగులు వేస్తున్నట్లు తాజాగా పార్లమెంట్‌లో జరిగిన చర్చ ద్వారా వెల్లడవుతోంది. బిజెపికి చెందిన రాజ్యసభ సభ్యులు జివిఎల్ ఇటీవల ఈ నౌక బెర్తు పనులు త్వరలోనే పోర్టులో పూర్తయి పోయి, నౌక కూడా వచ్చేస్తుందన్నట్లుగా ఈ ప్రదేశంలో పర్యటించి హడావుడి చేసిన సంగతి తెలిసిందే. కానీ ఔటర్ హార్బర్‌లో క్రూయిజ్ నౌక (సీ ప్లేన్) కోసం ఉద్దేశించిన టర్మినల్ పనులు మాత్రం ఒక కొలిక్కి వస్తున్నాయి. గురువారం రాజ్యసభలో జరిగిన ప్రశ్నోత్తరాల చర్చలో వైసిపి రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి ఈ అంశంపై కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రి అజయ్ భట్‌ను వివరణ కోరగా సీ ప్లేన్ సర్వీసులను విశాఖ పోర్టు నుంచి చేపట్టందుకు గానూ సర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

5 ఏళ్ల క్రితమే క్రూయిజ్ టెర్మినల్‌కు అనుమతులు

విశాఖ ఔటర్ హార్బర్‌లో క్రూయిజ్ బెర్తు నిర్మాణానికి అనుమతులు 5 ఏళ్ల క్రితమే వచ్చాయి. సుమారు రూ.77 కోట్లు బెర్తు నిర్మాణానికి వ్యయం అవుతుందని వైజాగ్ పోర్టు ట్రస్ట్ (విపిటి) ప్రతిపాదించింది. దీంట్లో సగం అంటే రూ.38.50 కోట్లు పర్యాటక కేంద్ర మంత్రిత్వశాఖ వెచ్చించాల్సి ఉంది. మిగిలిన మొత్తం విపిటి తన సొంత నిధుల నుంచి ఖర్చుచేయాల్సి ఉంది. ఈ ప్రాజెక్టుకు నౌకాదళం (ఈస్ట్రన్ నేవల్ కమాండ్) ఆమోదం కూడా 2021లో ఇచ్చింది. పర్యావరణ అనుమతులూ ఉన్నాయి. 2023లోగా ఈ ప్రాజెక్టు పూర్తికావాల్సి ఉన్నా జరగలేదు. దీనికి సంబంధించిన ప్రశ్న సాయిరెడ్డి అడగ్గా 2020-21లో కోవిడ్ రెండు దశల కారణంగా పనులు జరగలేదని మాత్రం సమాధానం వచ్చింది. బెర్తు సిద్ధం అయినప్పటికీ సీ ప్లేన్ సర్వీసులు వస్తాయా? ఎప్పుడు ప్రారంభిస్తారు? అన్న వాటికి మాత్రం కేంద్రం నుంచి సమాధానం రాకపోవడం గమనించదగినది.

సిజిహెచ్ఎస్ హాస్పిటల్ కూల్చివేతపై నిరసన

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : వాల్తేరు మానసిక వైద్య ఆరోగ్య కేంద్రం స్థలంలో ఉన్న సిజిహెచ్ఎస్ హాస్పిటల్‌ను మున్సిపల్ అధికారులు కూలద్రోయడాన్ని సిఐటియు విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు గురువారం సాయంత్రం హాస్పిటల్ ఎదుట సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. రోజుకు 300కు పైగా రోగులు తాకిడి ఉండే ఈ ఆసుపత్రిని తొలగించడం దారుణమన్నారు. మెంటల్ కేర్ యూనిట్‌ను ముఖ్యమంత్రి ఈ నెల 1న విశాఖ పర్యటనలో ప్రారంభిస్తారని రోడ్డు వెడల్పుకోసం సిజిహెచ్‌సి గోడ తొలగించాలని నోటీసులు ఇచ్చినా యాజమాన్యం పట్టించుకోలేదని పడగొట్టడం దుర్మార్గపు చర్య అన్నారు. విశ్రాంత ఉద్యోగులు మందులకోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పి.గోపాలకృష్ణ, ఎంఆర్‌డి.రాజు, బి.లక్ష్మీపతి, ఎం.ప్రదీప్, జివిఎన్.చలపతి, కొండలరావు, సిఐటియు నాయకులు పి.మణి, కె.కుమారి, జెఆర్.నాయుడు, టి.నూకరాజు, పోతురాజు, పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కోకింగ్ కోల్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడంపై..

గంగవరం పోర్టు చర్చకు సిద్ధమా?

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ జె.అయోధ్యరామ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'అదానీ గంగవరం పోర్టులో అదానీ సమీప బంధువైన సిఇఒ దేవేంద్ర ఠక్కర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నిజ విలువ (బుక్ వేల్యూ) పడిపోయింది, మా డబ్బులకు గ్యారెంటీ ఏమిటి? 5వేల టన్నులు మా దగ్గర పెట్టండి అనడం నిజం కాదా? చర్చకు సిద్ధమేనా?' అంటూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ జెఅయోధ్యరామ్ గురువారం సాయంత్రం గంగవరం యాజమాన్యానికి సవాల్ విసిరారు. తమది బాధ్యతాయుతమైన కార్పొరేట్ సంస్థ అని ప్రకటించుకుని ఆర్ఐఎన్ఎల్ ముఖ్య కస్టమర్ అని చెబుతూనే స్టీల్‌ప్లాంట్‌ను ఇబ్బంది పెట్టాలని చూడడం తగదని పేర్కొన్నారు. నాలుగు నెలల్లో రూ.75కోట్ల వరకూ స్టీల్‌ప్లాంట్ నుంచి గంగవరం పోర్టుకు చెల్లింపులు జరిగాయని అయోధ్యారామ్, మిగతా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులంతా మీడియాకు గురువారం సాయంత్రం వెల్లడించారు. స్టీల్‌ప్లాంట్‌లో 30వేల టన్నులే కోల్ ఉంది. ఇది ఇంకా 3 రోజులే వస్తుంది.. కానీ రూ.1000కోట్లతో స్టీల్‌ప్లాంట్ కొనుకున్న 2.30లక్షల టన్నుల కోల్ గంగవరం పోర్టులో ఎందుకు ఉంచుకున్నారని, ఆర్ఐఎన్ఎల్ తమకు కీలక కస్టమర్ అంటూనే ఇదేం పని? అంటూ ఆయన ప్రశ్నించారు. రోజుకు 16వేల టన్నులు సరఫరా చేసే కన్వేయర్‌లుంటే కేవలం రోజుకు 1300 టన్నులు ఇవ్వడం ప్లాంట్‌ను ఇరకాటంలో పెట్టడమేనన్నారు. కేవలం పోర్టుకు రూ.38కోట్లే బకాయి చెల్లించాల్సి ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ టర్నోవర్ రూ.30వేల కోట్లు ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకోకుండా గంగవరం యాజమాన్యం, ఆ సిఇఒ ఇలా వ్యవహరించడం క్షంతవ్యం కాదని, దీనిపై ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఎలాంటి చర్చకైనా సిద్ధమని అయోధ్యరామ్ తెలిపారు.

ఇగ్నో అడ్మిషన్ల గడువు పెంపు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో 2023 విద్యాసంవత్సరానికి గానూ వివిధ దూరవిద్యా కోర్సులతో పాటూ ఆన్‌లైన్ కోర్సులలో ప్రవేశాల గడువును ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు ఇగ్నో ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఉపాధి అవకాశాలు పెంచే కొత్త కోర్సులను ఇగ్నో అందిస్తోందని పేర్కొన్నారు. అడ్మిషన్లు ఆన్ లైన్ ద్వారా పొందాలని తెలిపారు. ఇగ్నో వెబ్‌సైట్‌లో ఉన్న అడ్మిషన్ల లింక్ https://ignouadmission.samarth.edu.in సంప్రదించాలని సూచించారు.

పార్టీ విజయం కోసం శ్రమిస్తా : గురువులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రానున్న ఎన్నికల్లో విశాఖలోని అన్ని నియోజకవర్గాల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులను, ఎంపీని గెలిపించేందుకు పూర్తి కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు చెప్పారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ అభ్యున్నతికి పాటు పడతానన్నారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని వైసిపి విజయం కోసం కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీతంరాజు సుధాకర్, చెన్న జానకిరామ్, ఉరికూటి నారాయణ, కృపా జ్యోతి, బొండా ఉమామహేష్, కలదిండి బదిరీనాథ్, అల్లంపల్లి రాజబాబు పాల్గొన్నారు.

5న ఐఐపిఇ స్నాతకోత్సవం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఐఐపిఇ మూడో స్నాతకోత్సవాన్ని ఈ నెల 5వ తేదీన నోవోటెల్ హోటల్‌లో నిర్వహించనున్నట్లు ఐఐపి డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపిఇ) భవనంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ గౌరవ శాస్త్రవేత్త ప్రొఫెసర్ అర్చన భట్టాచార్య ముఖ్య అతిథిగా హాజరై స్నాతకోత్సవంలో ప్రసంగిస్తారని తెలిపారు. స్నాతకోత్సవంలో 102 మంది బి.టెక్ విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ప్రతి బ్రాంచ్ నుంచి అకడమిక్ ప్రతిభకు గాను ఇద్దరు విద్యార్థులకు బంగారు, వెండి పతకాలను అందించనున్నట్లు వివరించారు.

10న విశాఖ నుంచి వారాహి యాత్ర

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : పవన్ కల్యాన్ చేపట్టిన వారాహి విజయ యాత్ర మూడో విడత ఈ నెల 10వ తేదీన విశాఖపట్నం నుంచి ప్రారంభం అవుతందని జనసేన నాయకుడు పీతల మూర్తియాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో విడత యాత్ర 19వ తేదీ వరకూ కొనసాగుతుందని పేర్కొన్నారు.

వలసగెడ్డ బురదమయం

సిసి రోడ్డు వేయాలని డిమాండ్

బురదమయంగా వలసగెడ్డ గ్రామం

ప్రజాశక్తి -సీలేరు : 15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు జికె.వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ పరిధి వలసగెడ్డ గ్రామం చిత్తడి చిత్తడిగా మారింది. గ్రామానికి రాకపోకలు సాగించే దారి బురదమయమైంది. వలసగెడ్డ గ్రామానికి రహదారి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు గురవుతున్నారు. నిత్యావసర సరుకులు కొనుగోలు చేయాలన్నా, వైద్య సేవలు పొందాలన్నా గ్రామం నుంచి బురదలో కాలినడకన సుమారు కిలోమీటర్ నడుచుకుంటూ ప్రధాన రహదారికి చేరుకోవాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు సైతం పాఠశాలకు వెళ్లాలంటే బురదలోనే నడిచి వెళ్ళవలసి వస్తుందని వాపోతున్నారు. ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు మారిన తమ తలరాతలు మారలేదని, తమ గ్రామాల అభివృద్ధి చెందలేదని చెబుతున్నారు. తమ గ్రామానికి సిసి రోడ్డు వేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకునే దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు గ్రామమంతా బురదగా మారడంతో స్థానికులు మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు గురయ్యే ప్రమాదం ఉందని గిరిజనులు వణుకుతున్నారు. ఇప్పటికే కొంతమంది జ్వరాలు బారిన పడ్డారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామానికి రహదారి సౌకర్యం తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు.

54వ వార్డులో గడపగడపకూ...

ప్రజాశక్తి- సీతమ్మధార : 54వ వార్డు మహారాణి వీధి, జ్యోతినగర్ ప్రాంతాల్లో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కె.కె రాజు, స్థానిక కార్పొరేటర్,స్టాండింగ్ కమిటీ సభ్యురాలు చల్లా రజిని ఈశ్వరరావు ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథక లబ్ధిపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జోనల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, డైరెక్టర్లు కాయిత వెంకటలక్ష్మీ రత్నాకర్, రాయుడు శ్రీను, నేతలు చిరంజీవి, అచ్యుతరావు, వెంకటేష్, గౌరీ ప్రసాద్, రమణమ్మ, ప్రకాశరావు, శంకర్, శివ ప్రసాద్, రాధాకృష్ణ, పైడి రాజు, హరినాధ్ రెడ్డి, శ్రీను, మోహన్, సూర్య ప్రకాష్, రమేష్, నాగరాజు, నూకరాజు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఆధునికీకరణకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ గోవింద్

ప్రజాశక్తి- సీతమ్మధార : గురుద్వార దరి శ్మశానవాటికను రూ.15లక్షల జివిఎంసి నిధులతో ఆధునికీకరణ, సౌకర్యాల కల్పన పనులకు 25వ వార్డు కార్పొరేటర్, జివిఎంసి మాజీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు సారిపిల్లి గోవింద్, 24వ వార్డు కార్పొరేటర్ సాది పద్మారెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎఇ శ్రీరామమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, సచివాలయం కన్వీనర్ సారిపిల్లి సంతోష్, వార్డు యూత్ అధ్యక్షుడు సన్నీ, మువ్వల పాపారావు, బోర వెంకటరమణ, బోర గోవింద్, సారిపిల్లి వెంకటరమణ, మువ్వల రాజు, ముద్దాడ కొండబాబు, నమ్మి రవి పాల్గొన్నారు

రెండో రోజుకు విద్యుత్ ఉద్యోగుల రిలే దీక్షలు

దీక్షలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు కాంట్రాక్ట్ కార్మికులు

ప్రజాశక్తి -సీలేరు : విద్యుత్ ఉద్యోగులు డిమాండ్ల సాధన కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరాయి. విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు జీకే వీధి మండలం సీలేరులో గురువారం నాటి దీక్షల్లో ఏఈ శిరోమణి, బి.శశిరేఖ, ఎల్.శ్రీదేవి, పి.శ్రీదేవి, డి.విజయ, జె.జ్యోతి, కాంట్రాక్ట్ కార్మికులు ఎస్.దేవి, యు.లక్ష్మి కూర్చున్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు వై.సత్తిబాబు, వై.ధర్మరాజు మాట్లాడుతూ జెన్కో యాజమాన్యంతో తమ డిమాండ్లపై జరిగిన చర్చల్లో ఎటువంటి పురోగతి లేదని, అందుకే రిలే దీక్షలో కొనసాగిస్తున్నామని తెలిపారు. తమకు దీర్ఘకాలికంగా నిలిచిపోయిన 3 డిఎలు మంజూరు చేయాలని, 2022 పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, ఈపీఎఫ్‌ను జిపిఎఫ్ గా మార్చే విధంగా ఏపీ జెన్కో యాజమాన్యం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీక్షలకు స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్య శ్రీనివాస్ తదితరులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు బి.లక్ష్మణ్, ఆర్.అనిల్, విద్యుత్ ఉద్యోగులు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన మావోయిస్టు వారోత్సవాలు

సరిహద్దు నుంచి వెనుదిరుగుతున్న పోలీసు బలగాలు

ప్రజాశక్తి -సీలేరు : మావోయిస్టు పార్టీ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. జులై 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టు పార్టీ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలకు పిలుపునిచ్చిన విషయం విధితమే. వారోత్సవాలు విజయవంతానికి మావోయిస్టు పార్టీ ఏర్పాట్లు చేసినప్పటికీ, ఒక పక్క పోలీసు కూంబింగ్, మరో పక్కా ఎడతెరిపిలేని వర్షాల కారణంగా వారోత్సవాలు ఎక్కడా కాన రాలేదు. ఆంధ్ర ఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టు కదిలికలు ఎక్కువగా ఉన్నాయని ఇంటెలిజెన్సీ వర్గాలు హెచ్చరికల నేపథ్యంలో సరిహద్దు పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో మావోయిస్టులు అమరుల స్థూపాలు ఏర్పాటు చేయడానికి అడ్డంకిగా మారింది. అయితే కట్ ఆఫ్ ఏరియా రహస్య ప్రదేశాల్లో మావోయిస్టులు తాత్కాలిక స్థూపాలు ఏర్పాటు చేసి అమరవీరులకు నివాళులర్పించినట్లు సమాచారం. వారోత్సవాలు ముగియడంతో పోలీసు బలగాలు గురువారం వెనిదిరిగాయి. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు పాటు అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో ఇటు ప్రజలు, అటు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

వెంకటేశ్వర వెటర్నరీ వర్సిటీ విద్యార్థుల గీతం సందర్శన

గీతం ల్యాబ్‌లో వెంకటేశ్వర వెటర్నరీ వర్సిటీ విద్యార్థులు

ప్రజాశక్తి- మధురవాడ : విజయనగరం జిల్లా గరివిడిలోని శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం వెటర్నరీ సైన్స్ కళాశాల విద్యార్థులు గురువారం గీతంవర్సిటీలోని ఔషధ ప్రయోగశాలలను, ఫార్మశీ విభాగాన్ని సందర్శించారు. ఔషధాల తయారీలో పరిశోధకులు జంతువులపై చేసే ప్రయోగాలు, వాటికి సంబంధించిన చట్టాలు, వెటర్నరీ నిపుణుల పాత్ర వంటివి అడిగి తెలుసుకున్నారు. ఫార్మశీ విభాగం పరిశోధకులు డాక్టర్ ఎన్.హరిశంకర్, డాక్టర్ జి.సుహసిని, ప్రొఫెసర్ సుబ్రత్‌కుమార్ బట్టమిశ్రా హాజరై వెటర్నరీ విద్యార్థులకు గీతంలోని ఔషధ ప్రయోగాలను, యానిమల్ హౌస్ ప్రాధాన్యత, ప్రయోగ సమయంలో చిన్న జంతువుల పట్ల తీసుకునే జాగ్రత్తలు వివరించారు.

అదానీ గంగవరం పోర్టు తప్పుడు ప్రకటనపై సిపిఎం ఖండన

విశాఖపట్నం : ప్రజల్లో వస్తున్న తీవ్ర నిరసనను తట్టుకోలేక వైజాగ్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం మీద, కార్మిక సంఘాలపైన అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం ప్రతిదాడికి దిగడాన్ని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తీవ్రంగా ఖండించారు. దిగుమతి చేస్తున్న స్టీల్‌ప్లాంట్ బొగ్గును, సున్నపురాయిని ప్లాంట్‌కి ఎలాంటి అంతరాయం లేకుండా అందిస్తున్నామని నిందారోపణలకు దిగజారిందని తెలిపారు. ఈ తప్పుడు ప్రచారాన్ని విడనాడకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అదానీ తప్పుడు ప్రకటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఖండించాలని విజ్ఞప్తి చేశారు. అదానీ పోర్టు విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి కలిగిస్తున్న ఆటంకాలపై తీవ్ర చర్యలు తీసుకోవాలని కోరారు.

వలసగెడ్డకు వాలంటీరును నియమించాలి

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ వలసగెడ్డ గ్రామానికి వాలంటీరును తక్షణమే నియమించాలని పంచాయతీ ఉప సర్పంచ్ జి.మంగరాజు, కొర్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో గురువారం వారు మాట్లాడుతూ తమ గ్రామానికి కొర్ర సీతారాం వాలంటీరుగా ఉండగా, ఆయన ఈ ఏడాది మే నెలలో వ్యక్తిగత కారణాల వల్ల విధుల నుంచి తప్పుకున్నారని, నాటి నుండి వాలంటీరు లేరని తెలిపారు. దీంతో తమకు ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఏ సమాచారం తెలియడం లేదన్నారు. వాలంటీర్‌ను నియమించాలని జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్‌కు మే 12న విన్నవించగా, ఆయన వెంటనే ఏపిడిఓకి ఫోన్ చేసి, గ్రామాన్ని సందర్శించి, వాలంటీర్ నియామకానికి చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు చెప్పారు. కాని నేటి వరకు తమ గ్రామాన్ని ఏపీడిఓ సందర్శించలేదని, వాలంటీర్‌ను నియమించలేదని వాపోయారు. కలెక్టర్‌కు అందజేసిన వినతిపత్రంపై ఆయన సంతకం చేయగా, దానిని జీకే వీధి ఎంపీడీవోకు అందజేశామని, అయినా ఎంపీడీవో ఉమామహేశ్వరరావు కూడా వాలింటీర్ నియమించే విధంగా చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు.వాలంటీర్ లేక పింఛన్లు సకాలంలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వలస గెడ్డ గ్రామానికి వాలంటీర్‌ను నియమించాలని కోరారు.

ప్రతి కుటుంబానికీ ఆర్థిక సాయం ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-కూనవరం : వరదల భయంతో వేరే ఊర్లకు వెళ్లిన వారందరికీ తప్పకుండా వరద సహాయ డబ్బులు, నిత్యవసరాలు ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య డిమాండ్ చేశారు. గత ఏడాది వచ్చిన వరదలను దృష్టిలో పెట్టుకొని ఈ సంవత్సరం ముందుగానే కిరాయి ఇళ్లకు వేరే గ్రామాలకు ప్రజలు వెళ్లారని తెలిపారు. కొన్ని ప్రాంతాలలో వరద డబ్బుల పంపిణీలో అవకతవకలు జరిగినట్టు సిపిఎం దృష్టికి ప్రజలు తీసుకొచ్చారని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ సహాయ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరద బాధితులకు ఇంకా బరకాలు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం వరద బాధితులకు అన్యాయం చేయకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సర్పంచ్ నాగమణి పాల్గొన్నారు.

ఎపిఎల్‌లో శ్రీకర్‌సాయికి రికార్డు ధర

- 16 నుంచి విశాఖలో ఆంధ్రా ప్రీమియర్ లీగ్ సీజన్ -2 క్రికెట్ సందడి

శ్రీకర్‌సాయి

ప్రజాశక్తి -పిఎం పాలెం : ఆంధ్ర ప్రీమియర్‌లీగ్ సీజన్-2లో నిర్వహించిన క్రీడాకారుల వేలంలో విశాఖ సంచలన యువ క్రికెటర్ జి.శ్రీకర్‌సాయిరెడ్డి రికార్డుస్థాయి ధర పలికింది. కోస్టల్ రైడర్స్ జట్టు ఈ యువ ఆల్‌రౌండర్‌ను రూ.3.90లక్షలకు దక్కించుకుంది. విశాఖ నగరంలోని విసిఎ,విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా ఎసిఎ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి నేతృత్వంలో ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్ 2కు క్రికెటర్ల వేలం నిర్వహించారు. రూ.25వేల బేసిక్ ధరతో వేలంలోకి ప్రవేశించిన 20 ఏళ్ల ఆల్‌రౌండర్ .జి శ్రీకర్‌సాయిరెడ్డి అద్భుతమైన నైపుణ్యం, దేశవాళీ క్రికెట్‌లో స్థిరమైన ప్రదర్శన ఆధారంగా కోస్టల్ రైడర్స్, అతని సామర్థ్యాన్ని గుర్తించి, రాబోయే సీజన్‌కు అతని సేవలను భద్రపరచడానికి అధిక ధరకు వెరవకుండా కొనుగోలు చేసింది.

.కోస్టల్ రైడర్స్ జట్టుకు ఆడే అవకాశం లభించినందుకు శ్రీకర్ సాయి రెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ, 'జట్టు నాపై చూపిన నమ్మకానికి నేను చాలా కతజ్ఞుడిని. అద్భుతమైన ఫ్రాంచైజీలో భాగం కావడంతో నా కల నిజమైంది' అన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్

ప్రజాశక్తి- సీతమ్మధార: ప్రజాసమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించినట్లు పార్టీ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె రాజు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను విన్నారు. కొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోనులో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు, వినతులు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని, చర్యానివేదికను తెలియపరుస్తానని భరోసానిచ్చారు.